క్లుప్తంగా

విశాలాంధ్ర రాము మృతికి సంతాపం


టి.రామారావు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్ర సమర యోధుడు, కమ్యూనిస్టు కార్యకర్త, శతాధిక వృద్ధుడు విశాలాంధ్ర రాముగా పిలువబడే తాన్న రామారావు(101) అనారోగ్యంతో మంగళవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతికి సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సంతాపం తెలియజేసారు. రామారావు పార్థివదేహంపై పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, టీవీఎస్ రాజు, కడుపు కన్నయ్య, ఎస్ సంజీవరావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. రామారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. మృత దేహాన్ని కుటుంబ సభ్యులు రామారావు కోరిక మేరకు ఏలూరు ఆశ్రమం వైద్య కళాశాలకు అందజేసారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన దూబచర్ల శ్రీనివాసరావు క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్సకు డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్న నగరానికి చెందినసాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం శ్రీనివాసరావుకు స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అతనిని కలిసి రూ. 10 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సభ్యులు సీహెచ్ శ్రీధర్, డీకేఎస్ ప్రకాష్ రావు, టీ. రామ్‌మోహన్, పీ. వెంకట రమణ, ఎంవీ సురేష్ కుమార్, గుంటూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీషులో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని అవిల స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ గ్రామర్ ఇనిస్టిట్యూట్‌లో వేసవి సెలవుల సందర్భంగా స్పోకెన్ ఇంగ్లీష్, అండ్ గ్రామర్‌లో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ నిర్వాహకుడు సీహెచ్ అనిల్ తెలిపారు. కేవలం విద్యార్థులకు మాత్రమే కాక ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులకు విద్యార్హతతో ఎటువంటి సంబంధం లేకుండా స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ శిబిరం 45 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు స్థానిక మార్కెట్‌యార్డ్ రోడ్డులోని వీవీ నగర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8712345900, 8367672259 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నేడు ఎంపీపీల సమావేశం

ఏలూరు రూరల్: బుధవారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా మండల పరిషత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించనున్నట్లు ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు చెప్పారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో 25 మంది మండల అధ్యక్షులు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీలు అందరూ కలిసి జిల్లా ఎంపీపీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని అన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

భీమడోలు: గుండుగొలనులోని వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 6వ తేదీతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. సోమవారం స్వామి వారిని పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేసారు. బుధవారం రాత్రి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈవో డి.శంకరరావు, కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనా కుమారి అచ్యుతరామారావు పాల్గొన్నారు.

ఏలూరు అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని
- అధికారులతో సమీక్ష సమావేశం


ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తోన్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించటమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి రూపాయి ప్రజలకు మౌలిక సదుపాయాలు, మెరుగైన సేవలకే వెచ్చించాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని చెప్పారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్ (సీఎండీఎఫ్), ఏలూరు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నగరంలో జరుగుతోన్న అభివృద్ధి పనుల ప్రగతిపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఏలూరు నగరపాలక సంస్థ, రెవెన్యూ, కార్పొరేషన్ ప్రజాప్రతినిధులతో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్లనాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి అభివృద్ధి నిధితో పలు పనులు చేపట్టామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.2కోట్ల నిధులు సమకూర్చిందని, వాటితో సుమారుగా 23 అభివృద్ధి పనులు చేపట్టేలా అధికారులు ప్రతిపాదనలు పూర్తి చేశారని చెప్పారు.

156 అభివృద్ధి పనులకు చర్యలు

ఏలూరు నగరంలో గడపగడపకూ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధే నినాదంతో సుమారుగా 156 పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే నాని చెప్పారు. రూ.5.68కోట్ల నిధులతో పనులు చేపట్టేలా టెండర్లు ప్రక్రియలు పూర్తి చేశారని తెలిపారు. సుమారుగా 74 అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయని స్పష్టం చేశారు. ఏలూరు నగరంలో నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేలా అధికారులు శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ నాయకులు బండారు కిరణ్‌కుమార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఏలూరులో మెడికల్ కాలేజీ మంజూరుపై హర్షం

- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని కృషితోనే సాధ్యం
- హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ


ఏలూరు సర్వజనాసుపత్రిలో ప్రసూతివార్డులో బాలింతకు పాలు, పండ్లు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు తదితరులు

ఏలూరు టౌన్: ఏలూరులో మెడికల్ కళాశాలకు అనుమతులు మంజూరు కావటంతో ఏలూరు నగరం, జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని కష్టానికి ఫలితంగానే మెడికల్ కాలేజీ ఏలూరుకు దక్కిందని ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు అన్నారు. ఏలూరు నగరంలో మెడికల్ కాలేజీకి ఈ ఏడాది నుంచి 150 సీట్లు కేటాయిస్తూ అనుమతులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఏలూరులోని ప్రభుత్వ బోధనాసుపత్రిలో రోగులకు, గర్భిణులు, ప్రసూతి స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. మహిళలను ఆప్యాయంగా పలుకరిస్తూ వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ఏలూరుకు మేలు జరిగిందని, ఎన్నో ఏళ్ల కాలం నాటి కోరికను నెరవేర్చుతూ ప్రజలకు ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనానితోనే ఏలూరు నగరం అభివృద్ధి సాధ్యమని మరోసారి రుజువయ్యిందని తెలిపారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాదరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలోని ప్రజలకు అత్యంత మెరుగైన ఆధునిక వైద్యం, చికిత్సలు, శస్త్ర చికిత్స అందుబాటులోకి వస్తాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏలూరు నగరంలో అభివృద్ధి అనేది ఎక్కడా జరగలేదని విమర్శించారు. టీడీపీ నేతలు కేవలం ఆర్భాటాలు చేయటమే తప్ప ఆచరణలో వారికి అభివృద్ధి సాధ్యం కాదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే ప్రజలకు మంచి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, పొలిమేర దాసు, దేవరకొండ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ నేతలు కిలాడి దుర్గారావు, ఇనపనూరి జగదీష్, ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రైతులకు అండగా మద్దతు ధరల చట్టం చేయాలి



రైతు కూలి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభ వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రైతాంగాన్ని ఆదుకునేందుకు మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ పిలుపు నిచ్చారు. అడవిపై, భూమిపై హక్కు కోసం రైతాంగం పండించే అన్ని రకాల పంటలకు గిట్టు బాటు ధర కోసం పోరాడుదామంటూ ఉద్ఘాటించారు. రైతు కూలీ సంఘం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభ స్థానిక ఏఎస్ఆర్ స్టేడియం సమీపంలోని షాదీఖానా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా నాయకులు కుంజం రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఝాన్సీ రాణి మాట్లాడుతూ అడవిపై హక్కు కోసం, దున్నేవానికే భూమి హక్కు కోసం, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం, ప్రజలు సమరశీల పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపు నిచ్చారు. ఈ సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, రాష్ట్ర నాయకులు యు.వీరబాబు, ఎస్కె భాషా, నవ్యాంధ్ర రాష్ట్ర సమితి అధ్యక్షుడు మాముడూరి మహంకాళి, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు తాటి బుల్లబ్బాయి, సవలం రాంబాబు మాట్లాడారు. సభ ప్రారంభానికి ముందుగా వందలాది రైతులు, కూలీలతో స్థానిక పాత బస్టాండ్ సెంటర్ నుంచి కర్రల వంతెన మీదుగా ఉర్దూ షాదీఖానా వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రైతు కూలీ సంఘం జెండాను రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు ఎగుర వేశారు. ఈ సభలో 16 తీర్మానాలు చేసి ఆమోదించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నూతన కమిటీని 11 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కుంజం రామారావు, కార్యదర్శిగా షేక్ భాషా ఎన్నికయ్యారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించుకోవాలి


సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి పిలుపు నిచ్చారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వామ పక్ష నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 3న నిర్వహించ తలపెట్టిన రాస్తారోకో కార్యక్రమంపై చర్చించారు. ఈ నెల 3వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ఏలూరు వసంత మహల్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ రాస్తారోకోలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)తో పాటు కార్మిక సంఘాలు, వామపక్ష సానుభూతిపరులు, రైతులు, రైతు సంఘాలు పాల్గొనాలని కోరారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, సీపీఐ జిల్లా నాయకులు టీవీఎస్ రాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ ఏలూరు జిల్లా కార్యదర్శి రాజనాల రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉపాధి హామీ రక్షణ యాత్ర


కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 4 నుంచి 13 వరకూ ఏలూరు జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ రక్షణ యాత్ర నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీని రక్షించుకుందామనే పేరుతో యాత్ర చేపట్టామని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఎస్ మహంకాళి, పి.మురళి,ఎం.హోలీ మేరీ, పి.లక్ష్మయ్య, సిహెచ్ మాధవ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నేత రామిరెడ్డి


రామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ ఉద్యమ నిర్మాత దాచూరి రామిరెడ్డి ఏడవ వర్ధంతి సభ స్థానిక యూటీఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏలూరులో జిల్లా అధ్యక్షుడు ఆర్. రవికుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జి తొలుత దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ రామిరెడ్డి నిబద్ధత కలిగిన నేత అని, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా విశేష సేవలందించారని అన్నారు. 16 ఏళ్ల సర్వీసుని సంఘం కోసం త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బీ. సుభాషిణి, జిల్లా కోశాధికారి ముస్తఫాలి, జిల్లా కార్యదర్శులు ఈ. శివశంకర్, నంబూరి రాంబాబు ఎస్. సుధారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి


మల్కాపురంలో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

ఏలూరు రూరల్: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. మంగళవారం ఆయన ఏలూరు మండలం మల్కాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను కలిసారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, జిల్లా జనరల్ సెక్రటరీ కట్నేని కృష్ణప్రసాద్, తపన చౌదరి, సత్యనారాయణ ఉన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. తడిసిన ధాన్యం మొలకలు వస్తున్నాయని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లాలో వరి పంటతో పాటు మొక్కజొన్న, పసుపు, మిరప తదితర పంటల రైతులను కూడా ఆదుకోవాలని రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మేడే స్థూపాన్ని ధ్వంసం చేయడం దారుణం

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డ్రైవర్లు 137వ మేడే సందర్భంగా పంపుల చెరువు గట్టు వెహికల్ షెడ్డు వద్ద గోడ పక్కన నిర్మించుకున్న జెండా దిమ్మను మున్సిపల్ యంత్రాంగం అర్ధరాత్రి అక్రమంగా ధ్వంసం చేయడాన్ని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు తదితరు తీవ్రంగా ఖండించారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కష్టపడే కార్మికులు తాము పనిచేసే ప్రాంతంలో జెండా దిమ్మలు నిర్మించుకోవటం సహజమని దీన్ని కూలగొట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. మున్సిపల్ యంత్రాంగం రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఈ విధమైన దుశ్చర్యలకు పాల్పడటం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. జెండా దిమ్మను తిరిగి స్థాపించేందుకు చర్యలు తీసుకోకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

14న హనుమాన్ శోభా యాత్ర బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీకి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కృష్ణ చరణానంద భారతి స్వామి

ఏలూరు (టూటౌన్): హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 14న ఏలూరులో హనుమాన్ శోభా యాత్ర బైక్ ర్యాలీని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు శోభా యాత్ర కన్వీనర్ కాట్రు విజయ్ తెలిపారు. స్థానిక తపన ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమలో శోభా యాత్రకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలను ముండూరు యజ్ఞవల్క్య రాజాశ్రమానికి చెందిన కృష్ణ చరణానంద భారతి స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ శోభాయాత్ర 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఏఎస్ఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న మేతేవారి స్థలం నుంచి ప్రారంభమై పాతబస్టాండ్, ఫైర్ స్టేషన్ మీదుగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సుమారు 9 కిలోమీటర్ల మేర యాత్ర సాగుతుందని తెలిపారు. శోభాయాత్ర బైక్ ర్యాలీకి హిందూ సంఘాలు, హిందూ బంధువులు, హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కృష్ణ చరణానంద భారతి స్వామి కోరారు. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయు చౌదరి, విశ్వహిందూ పరిషత్ క్షేత్ర నిధి, విధి ప్రముఖ్ కస్తూరి సూర్యప్రకాశరావు, శోభాయాత్ర కన్వీనర్ నడపన దాన భాస్కరరావు, కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా కాలభైరవి ఉత్సవాలు

పెదవేగి : మండలంలో కాలభైరవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి మంగళవారం పూజలు నిర్వహించారు. కమిటీ చైర్మన్ తాతా శారద, గౌరవ అధ్యక్షుడు రాజులపాటి బాపనయ్య పాల్గొన్నారు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	16
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	12
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	--
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	26
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

నేడు శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ

గణపవరం: గణపవరం వైఎస్సార్ కాలనీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయంలో ఈనెల 3వ తేదీ బుధవారం శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్మించిన యాగశాలలో మూడు రోజులుగా వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. టీటీడీ ఆలయ సన్నిధిగొల్ల కిషోర్‌యాదవ్ దంపతులు మంగళవారం పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు యంత్రస్థాపన, ధ్వజస్థాపన పూజలు, ఆలయ ప్రవేశం, ప్రాణప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ట్రాక్టర్లు, పనిముట్ల మంజూరు

దెందులూరు: మండలంలో 11 ఆర్‌బీకేల్లో ట్రాక్టర్లు, పనిముట్లు మంజూరయ్యాయని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.సుబ్బారావు తెలిపారు. మంగళవారం కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సబ్సిడీతో రూ. 17 లక్షలు విలువ చేసే ట్రాక్టర్, పనిముట్లు, మంజూరు చేశామన్నారు. సమావేశంలో కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, దెందులూరు ఏఎంసీ చైర్మన్ కాటి సుధాకర్, దెందులూరు ఏఓ గద్దె రమేష్, కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు

భీమడోలు: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని వైసీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం భీమడోలులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. విశాఖ ఉక్కును రక్షించుకునేందుకు బుధవారం ఉదయం భీమడోలు జంక్షన్‌లో అన్ని పార్టీల మద్దతుతో రాస్తారోకో చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఆర్.లింగరాజు అధ్యక్షత వహించారు. మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు రక్షణకు చేపట్టిన ఉద్యమానికి వైసీపీ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతును ప్రకటించిందన్నారు. వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, జిల్లా చైతన్య యువజన సంఘాల అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ, పైడిమాల యుగంధర్, కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజర్‌పై మండిపాటు

దెందులూరు: దెందులూరు మండల సర్వసభ్య సమావేశానికి మండలాధికారులు గైర్హాజరు కావడంపై దెందులూరు మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి, మండల వైస్ ఎంపీపీ గొల్లా నాగరాజుతో పాటు ఎంపీటీసీలంతా గైర్హాజరైన మండలాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.